# లెక్క

పావుకేజీ, అరకేజీ దాటి ఒకటో తరగతికి వచ్చారు పిల్లలందరూ. చిన్న చిన్న కూడికలు, తీసివేతలు చెపుతోంది "శారదామిస్". ఏ రెండు అంకెలనైనా కూడాలంటే ఆ రెండు అంకెల్లో ఒక్కొక్కదానికి, ఎన్ని ఒకట్లు వుంటాయో, అన్ని చిన్న గీతలు వరుసగా పలక మీద గీసుకుని, ఆ గీతల్ని అన్నీ కలిపి లెక్కపెడితే, ఎన్నో అంకె వస్తుందో, అది "ఆన్సర్" అని అర్థం అయ్యేట్టు చెప్పింది శారదామిస్.

రెండు మూడు కూడాలంటే, రెండుకి రెండు చిన్నగీతలు, మూడుకి మూడు చిన్నగీతలు పలకమీద గీసుకుని, మొత్తం ఒకటి రెండు మూడు నాలుగు ఐదు అని లెక్కపెట్టుకుని ఐదు అని చేప్పేస్తున్నారు పిల్లలు.

ఐతే, ఈ పద్ధతిలో గణపతితో ఒక చిక్కు వచ్చింది. వాడు గీతలు గీయడంలో అఖండుడు. మూడుకి, నాలుగు గీతలు,నాలుగుకి, ఐదుగీతలు, ఆరుకి పన్నెండు గీతలు ఇలా ఎన్నైనా గీసుకుంటూ వెళ్ళిపోసాగాడు. అందుకని శారదా మిస్ చాలా ఓర్పుగా పాత పద్ధతే నేర్పింది వాడికి. రెండు అంకెలు కూడాలంటే, ఒక్కొక్క అంకెకి ఒక్కొక్క చేతిలో అన్ని వేళ్ళు తెరిచి, మిగిలిన వేళ్ళు మూసి, ఆ రెండు చేతుల వేళ్ళను, జాగ్రత్తగా లెక్క పెట్టుకుంటూ వెళ్ళడం.

ఈ పద్ధతిలో గణపతి కొంత దారిలో పడ్డాడు. శారదామిస్ వాడిని ఇంకా దారిలో పెట్టేదే కాని, ఇంతలో ఆవిడ గర్భవతి అయి, లాంగ్‌లీవ్ పెట్టేసింది. మిస్ ఏమిటి, గర్భవతి అవడం ఏమిటి అని అపార్థం చేసుకోకండి. మిస్ అనేది టీచర్ మాటకి పర్యాయపదం. అంతే పెళ్ళయిన స్త్రీ అయినా సరే. కాన్వెంటులో టీచర్‌గా

జాయినయిన మరుక్షణం ఏదీ మిస్సవకపోయినా, “మిస్” మాత్రం అయి కూర్చుంటుంది. అది కాన్వెంట్ సంప్రదాయం.

లాంగ్‌లీవ్ పెట్టి మిస్సయిపోయిన మిసెస్ శారదా మిస్ స్థానంలో రజని మిస్ జాయినయింది. ఈవిడ నిజంగానే మిస్, అంచేత కొంచెం తొందరెక్కువ. దాంతో చిన్న చిన్న విషయాలు మిస్సయిపోతుంది.

మొదటి రోజున గణపతి ని అడిగింది? “గణపతీ! రెండు ప్లస్ రెండు ఎంతరా”

వాడు వెంటనే రెండు చేతులు మొహం దగ్గరికి ఎత్తి, వేళ్ళు మూసి లెక్కపెట్టి “నాలుగు మిస్” అని చెప్పాడు.



"మూడు ప్లస్ మూడు?" అడిగింది రజని మిస్ నుదురు చిట్లిస్తూ

గణపతి మళ్ళీ వేళ్ళు లెక్కపెట్టి "ఆరు మిస్" అన్నాడు

రజని మిస్‌కి ఈ వేళ్ళు లెక్కపెట్టే పద్ధతి కొంచెం చిరాకేసింది. "నాలుగు ప్లస్ నాలుగు ఎంత? వేళ్ళు లెక్క పెట్టకుండా చెప్పాలి? అంది.

గణపతి వల్ల కాలేదు. అటూ ఇటూ చూస్తూ వేళ్ళు లెక్కపెట్టుకుంటూనే "ఎనిమిది మిస్" అని సమాధానం చెప్పాడు.

మనస్సులో కూడడం ఎలాగో వాడికి నేర్పాలనుకుంది రజని మిస్ "గణపతీ! ఆ చేతులు రెండు జేబుల్లో పెట్టేసేయ్ ముందు" అంది. గణపతి అలాగే చేశాడు.

"ఇప్పుడు చెప్పు, ఐదు ప్లస్ ఐదు ఎంత?" గణపతి లెక్కపెట్టసాగాడు. వాడు మనస్సులో లెక్క పెడుతున్నాడనకుంది రజని. కాని వాడు జేబుల్లోనే లెక్కపెడుతున్నాడు. కొంతసేపటికి వాడు జేబుల్లోనే లెక్క పెడుతున్నాడన్న సంగతి గ్రహించింది రజని.

రజని మిస్ ఏదో చెప్పబోయేంతలో "పదకొండు మిస్" అని అరిచాడు గణపతి కళ్ళు తిరిగి పడిపోయింది మిస్ రజని మిస్.